
## చిట్టి కథ

# ఆ అందమే కావాలి!




వరా బాల్కనీలో నుంచుని చూస్తే ఎదురుగా ప్లాట్‌ఫారంలా పొడుగ్గా వున్న సిమెంట్ రేకుల గదులు, అందులో అద్దెకి వుంటున్న రెండు మూడు కుటుంబాలు కనిపిస్తాయి. ప్రక్కన బావి. ఆ యింటిలోని వాళ్ళంతా ఆ నీళ్ళే వాడాలి. చివరగా వున్న గదిలో ఒక వ్యక్తి వున్నాడు. ఒక్కసారి చూస్తే గుండె ఝల్లుమంటుంది. రాత్రిపూట చూస్తే గుండె ఆగిపోతుంది! అబ్బ! మనుష్యుల్లో ఇంత భయంకరమైన వాళ్ళుంటారా అనిపిస్తుంది. ఎందుకుండరు? నీగ్రోలకి గులాబీరంగు పెదవులూ, మల్లెపూవు ఛాయా ఎక్కడా కనిపించలేదు నాకు. అలాగే ఇలాంటి వాళ్ళూ వుంటారు.

ఆ వ్యక్తి నలుపు, పైగా స్ఫోటకం మచ్చలు. కళ్ళు తీరుగాలేవు. కళ్ళు బాగా బయటకి పొడుచుకు వచ్చి మిడిగుడ్లులా వుంటాయి—భయంకరంగా హత్య చేయబడిన వ్యక్తిలాగా. అబ్బ! అవేనా లోపాలు? ఊహూ. ముక్కు చాలా పెద్దది. పెదవులు రెండూ మూస్తే కలుసుకోవు. పళ్ళు గారపట్టి కనిపిస్తూనే వుంటాయి. అతన్ని చూసినప్పుడల్లా ఒళ్ళు ఒక్కసారి జలదరిస్తుంది, అతని నెరసిన వెంట్రుకలు చూసి ఏ యాభై ఏళ్లో అనుకున్నాను, కాదుట. అతనికి పాతికేళ్ళయినా లేవట. రవి చెప్పాడు. రవికి అతని గురించి బాగా తెలుసు. అతను ఒంటరిగాడుట, ఎవరూ లేరుట. రైల్వేలో ఏదో గుమస్తా పనట.

"అబ్బ! అతన్ని చూస్తే భయం వేస్తుంది." అంటే రవి "ఎందుకూ? అతనూ మనలాంటి మనిషే!" అన్నాడు.

'మనలాంటి' వాడు ఎందుకయ్యాడు? అంత ఘోరంగా వుంటే?"

"అతనికీ మనలా కాళ్ళూ చేతులూ అన్నీ వున్నాయి కాబట్టి. రూపం అంటావా? అశాశ్వతమైనది. మనమూ అతనూ అంతా చివరికి వెళ్ళేది ఒక్కచోటికే" అన్నాడు రవి.

"అతను జీవితాంతం ఇలాగే ఒంటరిగా గడపాలి కాబోలు! చూస్తూ చూస్తూ ఏ ఆడపిల్ల అతన్ని పెళ్ళిచేసుకుంటుంది?" అన్నాను.

"అని నువ్వు నిర్ణయిస్తే చాలా? భగవంతుడు అతనికి నీకన్నా అందమైన పెళ్ళాన్ని యిస్తాడేమో?" అన్నాడు రవి కొంటెగా.

'అలాంటి వ్యక్తితో ఒక్క నిముషమైనా ఏ ఆడదీ గడపలేదు' స్వగతంగా అనుకున్నాను. నాకు మళ్ళా మళ్ళా అదే ఆలోచన! రాత్రిపూట బెడ్‌రూం కిటికీలోంచి నైట్ క్వీన్ గుబాళిస్తూంటే, డిమ్‌లైట్ వెలుతుర్లో రవీ నేనూ పంచుకునే తీయని క్షణాల మధ్య అతను గుర్తువస్తే అబ్బ! ఇలాంటి క్షణాన్ని అతని భార్య అయితే ఎంత నరకంగా గడపాలో కదా అనిపిస్తుంది.

రవి అన్నట్టుగానే ఆశ్చర్యంగా ఆ భయంకర వ్యక్తికి పెళ్ళి అయింది-అందమైన ఆమెతోనే! నా ప్రాణం విలవిలలాడింది. ఎలా భరిస్తోందో ఆమె? ఉగ్గబట్టలేక ఎలాగో పరిచయం చేసుకున్నాను. నవ్వుతూ పలకరించింది. సాదరంగా ఆహ్వానించింది. కుంపటి వెలిగించి ఏదో చెయ్యబోయింది.

"అబ్బే! నా కోసం మీరు శ్రమపడవద్దు" అన్నాను.

"లేదులెండి మావారు వచ్చేటయిమైంది. ఏదైనా చేద్దామని," అని రవ్వ . తీయించి పంచదార పోసింది. మరింత విస్తుపోయాను. ఆమె పంజరంలో చిలకలా విలపించడం లేదు. అతని నుంచి ఎగిరిపోదామనుకోవడం లేదు. పైగా ఈ మర్యాదలు! ఇది నటనా నిజమా?

పెళ్ళి చీరెలు చూపించింది. సన్న బంగారు గొలుసు చూపించింది. అన్నీ అతను కొన్నవేనుట. ఒక చేమిటి, గాజులు, తిలకం, చెప్పులు పేరు పేరునా చూపించింది. చివరికి యిలా అంది.

"మీ అందరికీ నేను ఎట్లా ఆయన్ని పెళ్ళి చేసుకున్నానా అని ఆశ్చర్యంగా వుంది కదూ?" అతను కొన్న చీరె అపురూపంగా చేతులమధ్య పట్టుకుంది.

"యిలాంటి చీరె ముట్టుకుని కూడా ఎరగను, మా నాన్నకి మేము ఎనిమిది మంది సంతానం. పండగ రోజుల్లో బెల్లం కాఫీ తప్ప యిలా డబ్బా నిండా పంచదారా చూసి ఎరగను. తలకి నూనె రాసుకోవాలంటే ఎంత కష్టమో! వర్షం వస్తే చలికి వణుకుతూ, యిల్లంతా తడిసిపోతే ఒకమూల ఒదిగి కూర్చునేవాళ్ళం. బీదరికం వల్ల ఆప్యాయతలూ కరువే. మా అందరికీ ఒకళ్ళ మీద ఒకళ్ళకి ద్వేషం, చీదరింపులు తప్ప ఎరుగనిదాన్ని. "నువ్వు తిన్నావా" అని నా యింట్లో ఎవరూ అడగరు. అది కూడా వాళ్ళే తినాలనుకుంటారు. ఆయన నాకిష్టమైన కూరలు తెస్తారు. కొసరి కొసరి తినిపిస్తారు. నాకు తలనొప్పి వచ్చినా అల్లాడిపోతారు. నాకోసం సిగరెట్లు లాంటి చిన్న చిన్న అలవాట్లు కూడా మానుకుని నాకు కావలసింది కొని యిస్తారు. ఆయన అనాకారి అనే విషయమే నాకు గుర్తురాదు."

ఆవిడ మాట్లాడుతూనే వుంది. నాకు సిగ్గు కలిగింది—అతని రూపంపై సానుభూతి చూపలేని నా చిన్న బుద్ధివల్ల!

భార్యాభర్తల మధ్య ఆప్యాయత, అనురాగం, ఒక్కటే ఆకర్షణే కాదు. ఒకరికోసం ఒకరు త్యాగం చేసే హృదయ వైశాల్యం కూడా వుండాలి అని తోచింది!

ఆదే మనిషి అంతఃసౌందర్యం!

—ముక్కామల వసుంధరాదేవి